క్లుప్తంగా

నేడు పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

తుర్కయంజాల్: తుర్కయంజాల్‌లోని ఆదిత్యా నగర్ ఫేజ్‌లో నూతనంగా నిర్మించిన పోచమ్మ అమ్మవారి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం యంత్ర సహిత విగ్రహ ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎమ్మెల్సీ పరామర్శ

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండికి చెందిన సక్రునాయక్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి సక్రునాయక్ మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు హీరాసింగ్ తదితరులు ఉన్నారు.

ఫిట్స్‌తో వ్యక్తి మృతి

మంచాల: ఫిట్స్ రావడంతో కిందపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మంచాలలో చోటుచేసుకుంది. మంచాల సీఐ కాశీ విశ్వనాథ్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా చందంపేట్ మండలం లేదప తండాకు చెందిన ఇస్లావత్ పుల్లయ్య కుటుంబ గత కొన్ని సంవత్సరాలుగా మంచాల గ్రామంలో కూలీపనులు చేసుకుంటూ జీవిస్తోంది. పుల్లయ్య కుమారుడు ఇస్లావత్ ఉపేందర్ నాయక్ (30) వృత్తి రీత్యా టెంట్ హౌస్ వర్కర్‌గా పనులు చేస్తాడు. శుక్రవారం ఉదయం మంచాల గ్రామంలో శుక్రవారం నీళ్ల బావి సమీపంలో మల విసర్జనకు వెళ్లిన ఉపేందర్ నాయక్‌కు ఫిట్స్ రావడంతో కిందపడి పోయాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మంచాల పోలీసులు శవానికి పంచనామా నిర్వహించి ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం


నర్సింహ (ఫైల్)

హస్తినాపురం: భర్తతో గొడవ జరగడంతో పిల్లలను తీసుకొని భార్య పుట్టింటికి వెళ్లి పోయింది. దీంతో మనస్థాపం చెందిన భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ విషాద ఘటన జరిగింది. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన బి.నర్సింహ (40) రాధిక దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న నర్సింహ జీవనోపాధి కోసం పదేళ్ల క్రితం కుటుంబంతో సహా నగరానికి వచ్చి వనస్థలిపురం వైదేహినగర్‌లో ఉంటున్నాడు. గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరగడంతో మనస్తాపం చెందిన రాధిక పిల్లలను తీసుకొని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన నర్సింహ తాను నివాసం ఉంటున్న ఇంట్లోని సెల్లార్‌లో కొక్కానికి చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నర్సింహ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి మృతుని తండ్రి గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.వేలకోట్లతో ఎల్‌బీనగర్ అభివృద్ధి: సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయల నిధులను తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ గుంటి జంగయ్యనగర్‌లో గురువారం రాత్రి జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాన సమస్యలన్నీ పరిష్కరించామని, మిగిలి ఉన్న సమస్యలను కూడా రాబోయే రోజుల్లో పరిష్కరిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో గోపాల్, యాదయ్య, కన్నా, స్వరూప, కృష్ణమాచారి, లక్ష్మన్, నర్సింగ్‌రావు, సురేష్ తదితరులు ఉన్నారు.

ఇక్కడ బస్సులు ఆగట్లే

- నిరుపయోగంగా యాచారం, మాల్ ఆర్టీసీ బస్టాండ్లు
- రోడ్లపైనే ప్రయాణికులను ఎక్కించుకుంటున్న సిబ్బంది
- ఆవరణల కబ్జాకు యత్నిస్తున్న అక్రమార్కులు
- వినియోగంలోకి తేవాలంటున్న ప్రజలు


నిరుపయోగంగా యాచారం ఆర్టీసీ బస్టాండ్

యాచారం: రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌లు నిరుపయోగంగా మారాయి. దీంతో అక్కడ అసాంఘిక కార్యకలపాలు జరుగుతున్నాయంటూ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం, మాల్ కేంద్రాల్లో 15 ఏళ్ల కింద రూ.30 లక్షలకు పైగా నిధులతో బస్టాండ్లను కల్పించారు. నిర్మించిన కొత్తలో ఆర్టీసీ అధికారులు అక్కడే ఉండి సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని మాచర్ల, కనిగిరి, చిలకలూరిపేట, మార్కాపురం, దేవరకొండ, నల్లగొండ, కల్వకుర్తి తదితర డిపోలకు చెందిన బస్సులను బస్టాండ్‌లోకి వచ్చి, పోయేలా చూసేవారు. బస్టాండ్‌లోకి ప్రయాణికులు రావడం లేదనే సాకుతో ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లో ఉండటంలేదు. అప్పటినుంచి ఈ బస్టాండ్ల గురించి పట్టించుకునే వారే లేకపోవడంతో బస్సులు లోపలికి రావడం లేదు.

ఆక్రమణలకు యత్నం..

నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై 15 ఏళ్ల కిందట నిర్మించిన ఈ బస్టాండ్ స్థలం, ఆవరణ స్థలాలు ప్రస్తుతం రూ.కోట్లల్లో విలువ పలుకుతున్నాయి. ప్రస్తుతం సాగర్‌రోడ్డుపై ఎకరా భూమి రూ.2 కోట్లకు పైగానే డిమాండ్ ఉంది. యాచారం, మాల్ కేంద్రాల్లో ఈ బస్టాండ్ల కింద దాదాపు 6 ఎకరాలకు పైగా భూమి ఉంది. వీటికి మార్కెట్లో రూ.15 కోట్లకు పైగానే డిమాండ్ ఉంది. దీంతో ఈ స్థలాలను కబ్జా చేయడానికి, దొంగ రికార్డులను సృష్టించి ఆక్రమించడానికి అక్రమార్కులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. నిత్యం కొంతమంది బస్టాండ్ల భూమి మాదేనని, తమకే హక్కులు ఉంటాయని రికార్డుల మార్పు కోసం జిల్లా కలెక్టర్, యాచారం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారంటూ సమాచారం. ఆర్టీసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టి ఆర్టీసీ బస్టాండ్లను వినియోగంలోకి తేవడంతో పాటు, బస్టాండ్ స్థలాలను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

నాడు దూరం.. నేడు దగ్గర

యాచారం, మాల్ కేంద్రాల్లో 15 ఏళ్ల కిందట నిర్మించిన ఈ బస్టాండ్లు గ్రామాలకు దూరంగా ఉండేవి. ప్రస్తుతం బస్టాండ్‌ల వరకు ఇంటి నిర్మాణాలు జరిగాయి. మాల్, యాచారం కేంద్రాలు కూడా దినదినాభివృద్ధి చెందుతున్నాయి. వందలాది ఇంటి నిర్మాణాలతో ప్రస్తుతం ఈ బస్టాండ్లు ఇళ్ల మధ్యలోకి వచ్చేశాయి. ప్రయాణికులు రావడానికి కూడ సిద్ధంగా ఉన్నారు. బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో బస్సులు ఎక్కడ నిలుపుతాయో.. ఎక్కడ దింపుతాయో తెలియక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. యాచారం మండలంలోని పలు గ్రామాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు ప్రజలు నిత్యం వందలాది మంది ఇబ్రహీంపట్నం, నగరంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. బస్టాండ్లను ఆధునీకరించి వాడుకలోకి తెస్తే ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

బస్టాండ్‌లో బస్సులు ఆపాలి



యాచారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను వాడుకలోకి తెచ్చే విధంగా ఆర్టీసీ అధికారులు కృషిచేస్తే పంచాయతీ నుంచి పూర్తిగా సహకరిస్తాం. ప్రస్తుతం ఆ బస్టాండ్ సమీపంలో ఇంటి నిర్మాణాలు అధికమయ్యాయి. అంబేడ్కర్ చౌరాస్తా వద్ద కూడా విపరీతమైన రద్దీ ఉంటుంది. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి బస్సు బస్టాండ్‌లో ఆపేలా అధికారులు కృషిచేయాలి.

– శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్, యాచారం

గ్యారంటీ పథకాలతో పేదలకు మేలు

ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి


ఇబ్రహీంపట్నం రూరల్: మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

యాచారం: కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో శుక్రవారం యాచారం మండల టీడీపీ అధ్యక్షుడు గౌర నర్సింహ, చౌదర్‌పల్లి మాజీ ఎంపీటీసీ కొంగర జంగయ్య, ప్రస్తుత ఉప సర్పంచ్ నర్సింహ, కొమ్ము యాదయ్య, రామకృష్ణతో పాటు మరో 100 మందికి పైగా కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్సేనని అన్నారు. ఆరు గ్యారంటీ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని మల్‌రెడ్డి అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం మాజీ సర్పంచ్ నిట్టు నర్సింహ కాంగ్రెస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం తొర్రూర్‌లోని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి క్యాంపు కార్యాలయంలో మల్‌రెడ్డి సమక్షంలో ఆయనతో పాటు మరికొందరు నాయకులు హస్తం గూటికి చేరారు.

తండాలను జీపీలుగా చేశాం

- గిరిజనుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునిచ్చాం
- మరోసారి ఓటువేసి ఆశీర్వదించండి
- ప్రచార సభల్లో బీఆర్ఎస్ కల్వకుర్తి అభ్యర్థి జైపాల్‌యాదవ్


కడ్తాల్: గిరిజనులకు బీఆర్ఎస్ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్/ఆమనగల్లు: రాష్ట్రంలో తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనుల అభ్యున్నతికి కృషి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రేఖ్యా తండా గ్రామ పంచాయతీలో నిర్వహించిన బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని.. త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని, తనను ఆశీర్వాదించాలని కోరారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, లక్ష్మీనర్సింహారెడ్డి, కృష్ణయ్య, సులోచన, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఎంపీటీసీలు గోపాల్, మంజుల, చంద్రమౌళి, సాయిలు, జంగయ్య తదితరులు ఉన్నారు.

జైపాల్‌యాదవ్‌ను గెలిపించండి..

ఆమనగల్లు మండలం శెట్టిపల్లిలో శుక్రవారం కల్వకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా ఆపార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రజలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ నిట్టి నారాయణ, కోనాపూర్ ఎంపీటీసీ సరిత పంతునాయక్, రాంనుంతల సర్పంచ్ సోన శ్రీనునాయక్ ఉన్నారు.

కల్వకుర్తిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి


ఆమనగల్లు: కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

ఆమనగల్లు: నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ పార్టీ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో శుక్రవారం ఆయన సమక్షంలో పట్టణానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే మాడ్గుల మండలంలోని పలు తండాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని చెప్పారు. అవినీతి పాలన సాగిస్తున్న కేసీఆర్‌కు ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కల్వకుర్తి నుంచి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జంగయ్య, మల్లయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కసిరెడ్డిని గెలిపించండి..

తలకొండపల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి సతీమణి కసిరెడ్డి మాధవిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెంకటాపూర్‌లో సర్పంచ్ రమేష్‌యాదవ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డితో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నారాయణ్‌రెడ్డిని అఖండ మైన మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, భగ్‌వాన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జనార్దన్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు పక్కా ఇళ్లు..

కడ్తాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతామని జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు జహంగీర్‌బాబా అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా మండల కేంద్రంలోని పలు కాలనీల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్‌తో కలసి శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమానికి పాటుపడుతుందని, కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్, జంగయ్య, శ్రీకాంత్, యాదగిరి, సాయిలు, శ్రీను, నర్సింహ తదితరులు ఉన్నారు.

అందెలను గెలిపించండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి


నర్సింహారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న నేతలు

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అభ్యర్థించారు. శుక్రవారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే శ్రీరాములును గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. మన్సాన్‌పల్లి, మంఖాల్, సర్దార్‌నగర్ గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూంలను స్థానికులకు ఇవ్వకుండా పాతబస్తీకి చెందిన ఎంఐఎం కార్యకర్తలకు పంపిణీ చేశారని ఆరోపించారు. అలాగే 75 గజాల ఇంటి స్థలాలను స్థానిక బీఆర్ఎస్ కార్యకర్తలకు ఇచ్చారని తెలిపారు. అంతకుముందు నర్సింహారెడ్డి సమక్షంలో పలువురు బీజేపీలో చేరారు.బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, అమీర్‌పేట్ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు అనంతయ్య గౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆచారి


ప్రచార సభలో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: ఐదుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయి అలసిపోయాను. ఈసారైనా ఆదరించి గెలిపించండి అని కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి, చంద్రాయణపల్లితాండా, ముర్తుజపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆచారి మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలని కోరారు. ఒక్కసారి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని.. కల్వకుర్తిని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆయన చెప్పారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండె హరిప్రసాద్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు కండె సాయి, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు సుజాతారాములు, విక్రంరెడ్డి, లక్ష్మణ్, నర్సింహ, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు..

తలకొండపల్లి: తెలంగాణ ప్రజలు మార్పు కోరుకొంటున్నారని బీజేపీ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చంద్రధనలో బీజేపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతు పథకాల పేరుతో రాష్ట్ర సర్కార్ అక్రమాలకు పాల్పడుతుందని ఆరోపించారు. కల్వకుర్తిలో బీజేపీ అభ్యర్థి ఆచారిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు హేమరాజు, పాండు, ప్రసాద్, అనిల్, భగవంతు, రమేష్, నరేష్, భాను తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం

కల్వకుర్తి టీడీపీ ఇన్‌చార్జి యాదిలాల్

ఆమనగల్లు: తెలుగుదేశం పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తామని కల్వకుర్తి టీడీపీ ఇన్‌చార్జి యాదిలాల్ చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం యాదిలాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పనిచేస్తామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఈ ఎన్నికల్లో పోటీచేయడం లేదని చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఆయన చెప్పారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు తిమ్మయ్య, కృష్ణయ్య, సతీష్, నరేశ్, పాండుగౌడ్, సాయిబాబా, ఖాజా, పరిపూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ

హుడాకాంప్లెక్స్: షిర్డీ సాయి అష్టాంగ యోగా శిక్షణ ఆధ్వర్యంలో హుడాకాంప్లెక్స్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 5 నుంచి 14వ తేదీ వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇస్మాయిల్ గురూజీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సరూర్‌నగర్‌లో శిక్షణా తరగతుల పోస్టర్లను గోల్డెన్ టీం వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నరేశ్ గుప్తా, బూర మల్హార్‌గౌడ్ ఆవిష్కరించారు. ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, వ్యాయామాలు, ప్రాణాయామాలు, ధ్యానం, సూర్య నమస్కారాలు నేర్పించడంతో పాటు మునగాకు సూప్, మిరియాల కషాయం, రాగి జావ, రాగి ముద్ద, పచ్చి కూరగాయలు, పండ్లతో పాటు అమృత ఆహారం అందజేస్తామని ఇస్మాయిల్ గురూజీ తెలిపారు. అంజయ్యగుప్తా, రంగయ్యగుప్తా, సాయిచంద్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, ఉపేందర్, ఆనంద్ గుప్తా, బాబురావు,నాంపల్లి శ్రీనివాస్, శేఖర్, ప్రభు, వినోద్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


ఇబ్రహీంపట్నం రూరల్: మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి నాయకులు పెద్దసంఖ్యలో పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఎల్లమ్మతండాకు చెందిన కాంగ్రెస్, సీపీఎం పార్టీలకు చెందిన పలువురు వార్డు సభ్యులు, నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే ఆగాపల్లి, యాచారం మండలం నుంచి కాంగ్రెస్, బీజేపీ నాయకులు.. బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్మద, యాచారం, మంచాల మండలాల పార్టీ అధ్యక్షులు చీరాల రమేష్, కర్నాటి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయంకృషితో ఎదగాలి..

యాచారం: యువత స్వయంకృషితో ఆర్థిక ప్రగతి సాధించాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. యాచారంలో శుక్రవారం భూపతిగ్రాండ్ హోటల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత ఆర్థికప్రగతి కోసం పలు రకాల రుణాలు మంజూరు చేస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పాశ్ఛ భాషా, బీఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శేఖర్‌రెడ్డి, నందివనపర్తి మాజీ సర్పంచ్ రాజునాయక్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన పలువురు ముదిరాజ్ కులస్తులు శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో 150 మంది గులాబీ కండువా కప్పుకున్నారు.

ఇంటింటి ప్రచారం..

తుర్కయంజాల్: బీఆర్ఎస్ పార్టీ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి మేలు చేకూరిందని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం తుర్కయంజాల్‌లోని 11వ వార్డులో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటువేసి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దశరథ, బాబయ్య, దాసుగౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంచాల మండలం నుంచి...

మంచాల: మంచాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్, సీపీఎం పార్టీలకు చెందిన నాయకులు శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ఎంపీపీ నర్మద, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పట్నం, కల్వకుర్తిలో ఒక్కో నామినేషన్



ఆమనగల్లు: నామినేషన్ పత్రాలు అందజేస్తున్న రాజుగౌడ్


ఇబ్రహీంపట్నం రూరల్: నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సదానందరెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శుక్రవారం(మొదటిరోజు) ఒక నామినేషన్ దాఖలైంది. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో తొలిరోజు స్వతంత్ర అభ్యర్థిగా రాజగౌడ్ తన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనుకు అందించారు. నామినేషన్ వేసే అభ్యర్థులు తప్పక నిబంధనలు పాటించాలని ఆర్డీఓ శ్రీను సూచించారు. ఎక్కువ మంది మద్దతుదారులతో కలిసి నామినేషన్ కేంద్రంలో రాకూడదని ఈసీ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

ఇబ్రహీంపంట్నంలో..

ఇబ్రహీంపట్నం రూరల్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి శుక్రవారం(మొదటిరోజు) ఒక నామినేషన్ మాత్రమే దాఖలయ్యిందని రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభ్యర్థి ఉంద్యాల సదానందారెడ్డి నామినేషన్ వేశారు. రిటర్నింగ్ కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈ నెల 10వ తేది వరకు నామినేషన్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రతి అభ్యర్థి ఈసీ నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు పాటించనివారిపై చర్యలు తప్పవన్నారు.